


**అంత్యక్రియలకు వెళ్లొస్తూ..**
అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడం తో దంపతులు మృతి చెందారు. - 8లో



**ఆలయంలో చోరీకి యత్నం**
నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయంలో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. - 8లో



**విశ్వరూప విజయ యాత్ర**
విశ్వరూప విజయయాత్రను యాదాద్రి నుంచి ప్రారంభిస్తున్నట్లు మైసూర్ దత్త విజయా నందతీర్థ స్వామిజీ తెలిపారు. - 8లో

## రెండు నెలల్లో..
# 100 పడకల ఆస్పత్రి



వ్యవసాయానికి 24 గంటల కరెంట్ కావాలా అని మంత్రి హరీశ్‌రావు అడిగిన వెంటనే చేతులెత్తి ఓకే చెబుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, భగత్ తదితరులు

- బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- కేసీఆర్ వచ్చాకే నకిరేకల్ అభివృద్ధి : మంత్రి జగదీశ్‌రెడ్డి
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

**నకిరేకల్ :** నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల భవనం సముదాయం మరో రెండు మాసాల్లో అందుబాటులోకి రాబోతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మంత్రి జగదీష్‌రెడ్డితో కలిసి నకిరేకల్‌లో రూ.5.70 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన, నూతనంగా నిర్మించిన ఎస్టీఓ కార్యాలయం, గ్రంథాలయ భవనాలకు ప్రారంభోత్సవాలు చేశారు. 84 మహిళా సంఘాలకు రూ.8.65 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. నకిరేకల్‌లో వైద్యశాల పూర్తయితే మెరుగైన వైద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా మీకు అందుబాటులో అన్ని రకాల వైద్యసేవలు పొందవచ్చని చెప్పారు. నకిరేకల్ పట్టణంలో గతంలో చూస్తే రోడ్లు ఆగమాగం ఉండేవని.. నేడు పెద్ద పెద్ద డివైడర్లతో రోడ్ల విస్తరణ జరుగుతోందని పేర్కొన్నారు. మూడు గంటల కరెంటు కావాలా.. 24 గంటల కరెంటు కావాలో చేతులెత్తాలని సభికులను కోరగా.. 24 గంటల కరెంట్ కావాలని ప్రజలు, నాయకులు చేతులెత్తారు. ఈ సభలో ఇంతమంది ప్రజానీకాన్ని చూస్తే అద్భుతంగా ఉందని.. ఈ స్పందన చూస్తే నకిరేకల్‌లో చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యేగా గెలుపు ఖాయంగా కనిపిస్తోందన్నారు. కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి ఆలోచన చేయాలని.. ఇక్కడ చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరారు.

**చిరుమర్తిని మళ్లీ ఆశీర్వదించాలి : మంత్రి జగదీష్‌రెడ్డి**



విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో మీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను మరోసారి ఆశ్వీరదించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు తమ పాలనలో అభివృద్ధిని పట్టించుకోకుండా గ్రామాల్లో కొట్లాటలను ప్రోత్సహిస్తూ పబ్బం గడిపారని మండిపడ్డారు. 60 ఏళ్లుగా వెనుకబడిన నకిరేకల్‌కు సీఎం కేసీఆర్ వచ్చాక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో నకిరేకల్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

**అభివృద్ధి చేశా..ఆశ్వీరదించండి: ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి సహకారంతో రూ.వందల కోట్ల నిధులు తెచ్చి నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని.. మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యే గెలిపించాలని కోరారు. నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల, రూ.35 కోట్లతో రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు, రూ.101 కోట్లతో 11 గ్రామాలకు సాగు నీరందించే అయిటిపాముల లిఫ్ట్ తెచ్చానని చెప్పారు. అన్ని మండలాల్లో 90 శాతం మేర సీసీ రోడ్లు నిర్మించామన్నారు. బ్రాహ్మణ వెల్లెంల – ఉదయసముద్ర ఎత్తిపోతలకు తాజాగా రూ.200 కోట్ల నిధులు తెప్పించామన్నారు. త్వరలోనే కాల్వల నిర్మాణం పూర్తి చేసి సాగు నీరు అందిస్తామన్నారు. నకిరేకల్, రామన్నపేట, నార్కట్‌పల్లి మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. నియోజకవర్గానికి మరో రూ.50 కోట్లు మంజూరు చేయాలని మంత్రి హరీశ్‌రావును కోరారు. కార్యక్రమంలో సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జెడ్పీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చింతల సోమన్న, ఏపూరు సోమన్న, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, కొండ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ..**

- యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో రూ. 5.70 కోట్లతో చేపట్టనున్న 50పడకల ఆస్పత్రి భవనం, రూ.2.50కోట్లతో చేపట్టే శ్రీచెన్నకేశవ ఆలయం పునఃనిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు.
- సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో రూ.1.30కోట్లతో నిర్మించిన లక్ష్మీరాఘవరావ్ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. కల్యాణ మండపం ఎదుట నిర్మించిన సాగునీటి రంగనిపుణుడు దివంగత రామరాజు విద్యాసాగర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం కల్యాణ మండపంలో విద్యాసాగర్‌రావ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే స్థానిక వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డు ఎదుట ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ తన సొంత ఖర్చుల తో ఏర్పాటు చేసిన విద్యాసాగర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- తుంగతుర్తిలో రూ.45.45కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.4కోట్లతో నాలుగులేన్ల మెయిన్ రోడ్డు విస్తరణ, రూ.2.8కోట్లతో తుంగతుర్తి శివారులో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**అయిటిపాముల లిఫ్టు పనులకు శంకుస్థాపన**



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

**కట్టంగూర్ :** మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ సమీపంలో రూ.101.62 కోట్లతో నిర్మించనున్న లిఫ్టు ఇరిగేషన్ పనులకు శుక్రవారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు.. విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అయిటిపాముల లిఫ్ట్ ద్వారా నకిరేకల్, తుంగతుర్తి నియోజవర్గంలోని 11 గ్రామాల్లో 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఆరు నెలల్లో లిఫ్ట్ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ఎంపీపీ ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ సైదులు నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.



నకిరేకల్ సభకు హాజరైన ప్రజానీకం

# బాగుపడ్డ గిరిజన బతుకులు



దేవరకొండలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తదితరులు

- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- దేవరకొండ, మిర్యాలగూడ నియోజక వర్గాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

**దేవరకొండ, కొండమల్లేపల్లి :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గిరిజన బతుకులు బాగుపడ్డాయని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె దేవరకొండ నియోజకవర్గంలో రూ.126 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో ఒకప్పుడు ఆడ శిశువులను అమ్ముకునే దుస్థితి ఉండేదని, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నేడు గిరిజనుల బతుకులు మారాయని అన్నారు. తెలంగాణలోని మూడు వేలకుపైగా తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణలో ఆరు శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచి గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి 24 గంటల ఉచిత విద్యుత్‌పై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేశారని, అసలు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం పట్ల అవగాహన ఉండి మాట్లాడాడా... లేక మాట్లాడాడా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు చాలా మంది వస్తుంటారు.. పోతుంటారని ఆమె ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న పథకాలను పొందుతున్నారని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను మూడవ సారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కొండమల్లేపల్లిలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవనం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థినుల మధ్యలో కూర్చొని ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండలోని బంజార భవనం పనులు పూర్తి చేసేందుకు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే విధంగా కొండమల్లేపల్లిలో బంజార భవన్ నిర్మాణానికి రూ.50 లక్షలు, నియోజకవర్గంలోని మరో మూడు రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతలపహాడ్, కేశ్యతండాలకు చెందిన పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్, ఆర్‌వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ట్రైకార్ చైర్మన్ రాంచంద్రనాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీరాములు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబునాయక్, ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, మాధవరం సునితాజనార్దన్‌రావు, పద్మహన్మానాయక్, జెడ్పీటీసీలు మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, కేతావత్ బాలునాయక్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌కే సాధ్యం**

**అడవిదేవులపల్లి :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం అడవిదేవులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి నియోజకవర్గ అభివృద్ధికి రూ.76 కోట్లు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, చినరామయ్య, మంగమ్మ, కొత్త మర్రెడ్డి, నలమోతు సిద్దార్థ, బండి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

**గిరిజనుల అభివృద్ధే లక్ష్యం**

**మిర్యాలగూడ :** రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని గాంధీనగర్ నుంచి కల్లేపల్లి వరకు బీటీ రోడ్డు, రూ.4.20 కోట్లతో దామరచర్ల మండల కేంద్రంలో నిర్మించనున్న గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు ఆమె ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతోపాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న వారికి ఇతర రాష్ట్రాల్లో కంటే అధిక వేతనం ఇస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఆమె కల్లేపల్లి గ్రామంలో వెలసిన బంగారు మైసమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచందర్ నాయక్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాసులు, ఆర్డీఓ చెన్నయ్య, మార్కెట్ చైర్మన్ బుచ్చయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, జెడ్పీటీసీ ఆంగోతు లలితహాతిరాంనాయక్, ఎంపీపీ నందినిరవితేజ, ఎంపీటీసీ పాచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

## న్యూస్‌రీల్

### రుణమాఫీపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

**నల్లగొండ అగ్రికల్చర్ :** రుణమాఫీ పథకం 2018పై జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ పథకం అమలు కాని రైతులు, ఇతర రుణమాఫీకి సంబంధించిన వివరాలను గ్రీవెన్స్‌సెల్‌లో తెలియజేసి సమస్యను పరిష్కరించు కోవచ్చన్నారు. గ్రీవెన్స్ సెల్‌లో కె.విజయలక్ష్మి ఏఓ సెల్ : 7702415965, ఎం.శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్ సెల్ : 9704823466 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తులు

**నల్లగొండ టౌన్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఆయూష్ ఫార్మసిస్టు పోస్టులు(4) కాంట్రాక్టు పద్ధతిలో నియమించడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద (1), యునాని (3) పోస్టులు భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు, ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు ఎండీ యూసూఫ్ 90528 13786 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

### మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

**నార్కట్‌పల్లి :** మధ్యాహ్న భోజన కార్మికులకు సమ్మె చేస్తున్నప్పటికీ పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని యథావిధిగా కొనసాగించే బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉందని డీఈఓ భిక్షపతి పేర్కొన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో కొనసాగుతున్న హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం, పాఠశాల ఆవరణ, ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న పరీక్ష పత్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని, రాగి జావా అందించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం బి.హిమజ, శంకర్, నర్సింహ తదితరులు ఉన్నారు.

### రైతులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న వినయ్‌కుమార్

**డిండి :** సన్న, చిన్న కారు రైతుల సమస్యల పరిష్కారానికి ఎఫ్‌పీసీ (రైతు ఉత్పత్తిదారుల కంపెనీ) సహకారం అందిస్తుందని నాబార్డ్ జిల్లా మేనేజర్ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దతండా స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద వ్యవసాయ శాఖా సహకారంతో బేసిక్స్ సంస్థ పర్యవేక్షణలో రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఎఫ్‌పీసీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎఫ్‌పీసీల ద్వారా రైతులు సంఘటితంగా పంట సాగు చేయడం, పంట గిట్టుబాటు ధర, పంట పెట్టుబడి తగ్గించేందుకు డీలర్ ధరలకే ఎరువులు, విత్తనాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగేశ్వరరావు, ఉద్యాన శాఖా డివిజన్ అధికారి ప్రవీణ్, సంగమేశ్వర్, వెంకటయ్య, ఆంజనేయులు, మండల ఎఫ్‌పీసీ డైరెకర్స్ పాల్గొన్నారు.

### ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**నల్లగొండ :** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి సూచించారు. ఓటు హక్కుపై ట్రాన్స్‌జెండర్స్‌కు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ఎలా నమోదు చేసుకోవాలి, దాని వల్ల ప్రయోజనాలు, సీ విజిల్ యాప్ తదితర అన్ని విషయాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ హరిత, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

**నల్లగొండ :** జిల్లాలో వైరల్, డెంగీ జ్వరాలపై డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ వైద్యులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగీని సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సీజనల్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్స అందించాలని వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య అధికారులు ఫీవర్ సర్వే చేయాలని, దోమల నివారణకు ఎంటమాలజీ విభాగంతో పాటు మున్సిపల్, పంచాయతీ సిబ్బందితో కలిసి యాంటి లార్వా, ఫాగింగ్, డ్రైడే వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తన పరిధిలో మానిటరింగ్ చేయనందుకుగాను షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పరిధిలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్ర్య, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్‌ఇన్

మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించింది. పట్టణంలోని దోమల బెడద ఎక్కువ కావడంతో వివిధ కాలనీల ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. పట్టణంలో పలుచోట్ల ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి ఇబ్బందిగా మారుతుంది. పారిశుద్ధ్యం, డ్రైయినేజీ, మంచినీరు, వీధిలైట్లు తదితర సమస్యలను ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

**తేదీ : 30-09-2023 (శనివారం)**

ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : **98499 05914**



పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్ మిర్యాలగూడ

# కాంగ్రెస్‌లోకి మోత్కుపల్లి?

**బెంగళూరులో డీకేతో చర్చలు**

- తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి
- సానుకూలత వ్యక్తం చేసిన శివకుమార్
- త్వరలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో హస్తం గూటికి



బెంగళూరులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను కలిసిన మోత్కుపల్లి నర్సింహులు

**సాక్షి, యాదాద్రి :** మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. అసెంబ్లీ టికెట్ ఇస్తానని తనకు హామీ ఇచ్చిన కేసీఆర్.. ఆరు నెలలుగా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడంతో హస్తం గూటికి చేరాలని డిసైడ్ అయ్యారు. శుక్రవారం ఆయన బెంగళూరులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. తుంగతుర్తి టికెట్ ఇవ్వాలని కోరగా అందుకు డీకే సానుకూలత వ్యక్తం చేయడంతో త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

**ఏ పదవీ దక్కని మోత్కుపల్లి**

రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడో ఒక చోట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని మోత్కుపల్లి నర్సింహులు తన అభిప్రాయాన్ని పలుమార్లు వెల్లడించారు. అయితే సీఎం కేసీఆర్ సిట్టింగులకే సీట్లు కేటాయించడంతో ఆ అవకాశం లేకుండాపోయింది. కాగా బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న మోత్కుపల్లి.. కేసీఆర్‌ను నేరుగా కలిసి మాట్లాడాలని ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నా అవకాశం ఇవ్వడంలేదని ఆయన మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. హుజురాబాద్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం తీసుకువచ్చిన దళితబంధు పథకం చైర్మన్ లేదా ఎమ్మెల్సీ, రాజ్యసభ ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆశతో ఉన్న మోత్కుపల్లికి ఏ అవకాశం కేసీఆర్ కల్పించలేదు.

**తుంగతుర్తి నుంచి పోటీకి సంసిద్ధత**

ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న మోత్కుపల్లి వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల నియోజకవర్గంతో పాటు పలు చోట్ల మీడియా సమావేశాల్లో మోత్కుపల్లి అనుచరులు ప్రకటించారు. అయితే బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించినా సిట్టింగ్ కోటాలో తుంగతుర్తి నుంచి గాదరి కిషోర్‌కుమార్‌కు మూడవ సారి టికెట్ లభించింది. ఆలేరులో ఐదు సార్లు (టీడీపీ, ఇండిపెండెంట్, కాంగ్రెస్), తుంగతుర్తి నుంచి టీడీపీ తరఫున ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఆలేరు ఎమ్మెల్యేగా గెలిచిన మోత్కుపల్లి అనంతరం టీడీపీలో చేరారు.అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో మరోసారి కాంగ్రెస్ నుంచి తుంగతుర్తిలో పోటీకి సిద్ధం అవుతున్నారు.

**ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లోకి?**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు కాంగ్రెస్ నాయకుడొకరు చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సహ జిల్లాలోని ముఖ్యనేతలంతా కొంత కాలంగా మోత్కుపల్లితో టచ్‌లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి జిల్లాలో పార్టీకి సీనియర్ నేతగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర నేతల సూచన మేరకు బెంగళూరులో డీకే శివకుమార్‌ను కలిశారు. మాజీ ఉప ముఖ్య మంత్రి దామోదర రాజనర్సింహ హైదారాబాద్‌లోని మోత్కుపల్లి ఇంటికి వచ్చి సుదీర్ఘంగా చర్చించడంతోపాటు కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలాగే జిల్లాలో సీనియర్ నేత మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు మోత్కుపల్లిని పార్టీలోకి రావాలని కోరినట్లు సమాచారం. అయితే ఉమ్మడి జిల్లాలో పేరున్న మోత్కుపల్లి కాంగ్రెస్‌లో చేరిక బీఆర్‌ఎస్‌కు నష్టమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రవీందర్‌రెడ్డి (ఫైల్)

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం తిమ్మాపురం గ్రామానికి చెందిన గుడిపల్లి రవీందర్‌రెడ్డి(50) ఈ నెల 16న సూర్యాపేట–జనగామ 365బీబీ హైవే మీదుగా గ్రామ శివారులోని తన పొలం వద్దకు సైకిల్‌పై వెళ్తుండగా స్థానిక జియో పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉందని, బతకడం కష్టమని వైద్యులు చెప్పడంతో ఈ నెల 27న కుటుంబ సభ్యులు అతడిని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఇంటి వద్దనే స్థానిక వైద్యుడితో చికిత్స చేయిస్తుండగా.. శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ బి. అంజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. అంజిరెడ్డి తెలిపారు.

### కారు అద్దం ధ్వంసం చేసిన దుండగులు

మోత్కూరు: పట్టణంలోని భువనగిరి రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన కారు అద్దంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త అరవ సునీల్ కుమార్ కారులో శుక్రవారం మోత్కూరుకు వచ్చి తన మిత్రుడు సైమన్‌తో కలిసి భువనగిరి రోడ్డులో గల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోకి వెళ్లారు. బ్యాంకు ఎదుట పార్కింగ్ చేసిన సునీల్‌కుమార్ కారు వెనుక భాగంలోని కుడి వైపు అద్దంను గుర్తుతెలియని ధ్వంసం చేశారు. సునీల్‌కుమార్ బయటకు వచ్చి చేసేసరికి కారు అద్దం పగిలి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ నర్సింహనాయుడు పరిశీలించారు.

### కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకున్న బాలుడు

మిర్యాలగూడ: బాలుడిని కిడ్నాపర్లు ఎత్తుకెళ్లగా వారి చెర నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటన దామచర్ల మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన 12 సంవత్సరాల రోహిత్‌కుమార్ శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటుండగా కారులో వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు అతడిని ఎత్తుకెళ్లారు. అయితే మిర్యాలగూడ శివారులోని ఈదులగూడకు రాగానే కిడ్నాపర్లు కారులో నుంచి దిగి మాట్లాడుకుంటుండగా.. బాలుడు కారులో నుంచి దిగి వారి నుంచి తప్పించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక బాలుడు స్థానికుల ఫోన్ నుంచి తన తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని తమ కుమారుడిని ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్‌ఐ రవికుమార్‌ను సంప్రదించగా బాలుడు కిడ్నాపైన విషయమై తల్లిదండ్రుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అసలు బాలుడి కిడ్నాప్ వాస్తవమా కాదా అనే విషయంపై విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# అంత్యక్రియలకు వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- దంపతులతో పాటు వారి కుమార్తె దుర్మరణం
- మరో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలు
- ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు వద్ద ఘటన
- మృతుల స్వస్థలం మునగాల మండలం వెంకట్రాంపురం ఆవాసం ఎస్‌ఎంపేట గ్రామం


కారులో ఇరుక్కుపోయిన సంతోష్‌కుమార్ మృతదేహం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి


ఆస్పత్రిలో రూన్సీ మృతదేహం


సంతోష్‌కుమార్ (ఫైల్)

మునగాల(కోదాడ): అంత్యక్రియలకు హాజరై వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో దంపతులతో పాటు వారి కుమార్తె మృతిచెందారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద ఈ ప్రమాదంలో మరో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. మృతుల స్వస్థలం మునగాల మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ ఆవాసం ఎస్‌ఎంపేట గ్రామం. వివరాలు.. ఎస్‌ఎంపేట గ్రామానికి చెందిన మందపెల్లి రామారావు, లక్ష్మయ్య అన్నదమ్ములు. రామారావు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. రామారావు కుమారుడు ఆస్ట్రేలియాలో ఉండడంతో అతడు వచ్చాక శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా లక్ష్మయ్య కుమారులు సంతోష్‌కుమార్, అరుణ్‌కుమార్ గత ఏడాది కాలంగా ఖమ్మం పట్టణంలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తమ పెద్దనాన్న అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రెండు కార్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఎస్‌ఎంపేటకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో సంతోష్‌కుమార్‌తో పాటు భార్య రూన్సీరాణి, వారి ఇద్దరు కుమార్తెలు, అతడి తమ్ముడు(అరుణ్‌కుమార్) పిల్లలు ఇద్దరు కలిసి ఒక కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు ఖమ్మం జిల్లాలోని తల్లంపాడు వద్ద సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మందపల్లి సంతోష్‌కుమార్(38) అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య రూన్సీరాణి(35)కి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణంలోని మమత హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని ఖమ్మం పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఇందులో సంతోష్‌కుమార్ పెద్ద కుమార్తె యోజిత(16) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాలను ఎస్‌ఎంపేటకు తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

# యాదాద్రి నుంచే విశ్వరూప విజయ యాత్ర

- మైసూరు శ్రీదత్త విజయానందతీర్థ స్వామిజీ


ఆలయంలో శ్రీస్వామిని దర్శించుకొని, ప్రవచనాలు చేస్తున్న విజయానందతీర్థ స్వామిజీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం మైసూర్ దత్త విజయానందతీర్థ స్వామిజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యాదాద్రీశుడి సన్నిధిలోని శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో చతుర్మాస దీక్షను ముగించారు. అనంతరం యాదాద్రి కొండపైన స్వయంభూలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామిజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లోక కల్యాణార్థం విశ్వరూప విజయయాత్రను యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. యాదాద్రి ఆలయ శిల్పకళా సౌందర్యం అద్భుతంగా ఉందన్నారు. చాలా తక్కువ సమయంలో ఇలాంటి నిర్మాణం చేపట్టిన ప్రభుత్వానికి, ఇంజనీర్లు, శిల్పులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ప్రవచించారు. స్వామిజీ వెంట ఈఓ గీతారెడ్డి, చీఫ్ ఆర్కిటెక్ట్ మధుసూదన్, ఆలయాధికారులు, అర్చకులు ఉన్నారు.

# పట్టపగలే ఆలయంలో చోరీకి యత్నం


విజయదుర్గ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

నేరేడుచర్ల: పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి యత్నించారు. ఈ ఘటన శుక్రవారం నేరేడుచర్లలో చోటు చేసుకుంది. ఆలయ ప్రధాన అర్చకుడు మొలుగు శ్రీనివాసాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని విజయదుర్గ ఆలయంలో రోజు మాదిరిగానే పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 3గంటల సమయంలో గర్భగుడికి తాళం వేసి ప్రధాన అర్చకుడు ఇంటికి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు 4గంటల సమయంలో ఆలయంలోకి ప్రవేశించి రాడ్డుతో హుండీ తాళం పగుగొట్టి అందులో ఉన్న డబ్బులను దొంగలించేందుకు ప్రయత్నించారు. గర్భగుడి తాళాలు పగులగొట్టేందుకు కూడా యత్నించి విఫలమయ్యారు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి వచ్చిన భక్తులు గమనించి పూజారికి సమాచారం అందించారు. ఆలయానికి చేరుకున్న ఆలయ ప్రధాన అర్చకుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొణతం ఆదిరెడ్డితో పాటు కమిటీ సభ్యులు ఆలయానికి చేరుకొని పరిశీలించారు. గతంలో ఇదే ఆలయంలో దుండగులు అర్ధరాత్రి హుండీని ఎత్తుకెళ్లి నగదును దొంగలించారు.

# అప్పల బాధతో రైతు ఆత్మహత్య


అయిలయ్య (ఫైల్)

మోత్కూరు: అప్పుల బాధతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగిబావి గ్రామానికి చెందిన జినుకల అయిలయ్య(52)కు భార్య పద్మ, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె వివాహం అయ్యింది. అయిలయ్య తనకున్న రెండెకరాల భూమిలో వరి పంట వేశాడు. మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. కుమార్తె పెళ్లితో పాటు పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. అప్పు విషయమై తండ్రీకొడుకుల మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అయిలయ్య శుక్రవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి అయిలయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న అయిలయ్యను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

- 6 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.13వేల నగదు అపహరణ

త్రిపురారం: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన త్రిపురారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. శుక్రవారం త్రిపురారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రంలో ఇందిరమ్మ కాలనీలో కందిమళ్ల శ్రీనివాస్‌రెడ్డి నివాసముంటున్నాడు. అతడు పని నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. 6 తులాల బంగారం, 60 తులాలు వెండి, రూ.13వేల నగదు దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ప్రమాదవశాత్తు కారు దగ్ధం


దగ్ధమవుతున్న కారు

రాజాపేట: ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ఘటన రాజాపేట మండలంలోని జాల గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. జాల గ్రామానికి చెందిన మునిగంటి ఉమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటల జిల్లా గజ్వేల్ మండలంలోని ఆర్వీఎం ఆస్పత్రికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో రాజాపేట మండంలోని జాల గ్రామ శివారులోకి రాగానే కారులో మంటలు రావడంతో గమనించిన ఉమేష్ తన భార్య భార్గవి, కుమారుడితో కలిసి వెంటనే కారు దిగి దూరంగా పరిగెత్తారు. వెంటనే మంటలు పెద్దవై కారు పూర్తిగా దగ్ధమైంది. రోడ్డు వెంట వెళ్తున్న వాహనదారులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

### రైతులకు అవగాహన సదస్సు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): మిరప సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై ఆత్మకూర్ మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామంలో రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ మాట్లాడుతూ పంటలను ఆశించే చీడ పీడల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో భాగంగా రైతులు పొలంలో ఎకరానికి 50 చొప్పున పసుపు, నీలిరంగు మరియు తెలుపురంగు జిగురు అట్టలు అమర్చుకోవాలని, పంటలను ఆశించే దోమ, రెక్కల పురుగుల నివారణకు మినీ సోలార్ ట్రాప్ పెట్టుకోవడం ద్వారా 50 శాతం పైగా పురుగులు నివారించబడతాయని పేర్కొన్నారు. మిరపలో ఆశించే తామర పురుగు, నల్లి నివారణకు తల్లి పురుగులు గుడ్లు పెట్టకుండా వేపనూనె పిచికారీ, జీవ నియంత్రణ శిలీంద్రాలైన బవేరియా, బాసియానా, వర్టిసీలియం లెకాని 5 మి.లీ. లీటరు నీటిలో వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీకే, గడ్డిపల్లి ఉద్యాన శాస్త్రవేత్త, సీహెచ్ నరేష్, రైతులు పాల్గొన్నారు.

### ఎన్జీ కళాశాల ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ గైడ్‌షిప్


నియామకపత్రాలు అందుకుంటున్న ప్రొఫెసర్లు

రామగిరి(నల్లగొండ): ఎన్జీ కళాశాలకు చెందిన తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణకౌండిన్య, ఎస్.దీపిక, వెల్దండి శ్రీధర్‌లకు ఎంజీ యూనివర్సిటీ పీహెచ్‌డీ గైడ్‌షిప్‌గా అవకాశం వచ్చింది. ఈ మేరకు వారికి ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ బి.గోపాల్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ మాట్లాడుతూ అధ్యాపకులకు గైడ్‌షిప్ రావడంతో రాబోయే న్యాక్ గ్రేడ్‌కు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ అల్వాల రవి, డాక్టర్ ఆకుల రవి, రమణారెడ్డి ఉన్నారు.

# మహిళ అదృశ్యం.. కేసు నమోదు


రమావత్ జ్యోతి

త్రిపురారం: మండలంలోని లోక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మహిళ అదృశ్యమైంది. శుక్రవారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామ పరిధిలోని గద్దగుండు తండాకు చెందిన ఒంటరి మహిళ రమావత్ జ్యోతి త్రిపురారం మండలంలోని లోక్యతండాలో ఉంటున్న తన అక్క ఇంటికి మూడు నెలల కిందట వచ్చి గ్రామంలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ నెల 21న తలనొప్పి ఉందని మిర్యాలగూడలో ఆస్పత్రికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన జ్యోతి తిరిగి ఇంటికి రాలేదు. తన ఫోన్ కూడా పనిచేయకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సింగం విజయ్‌పై అనుమానం ఉందని జ్యోతి అక్క భర్త ధనావత్ శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# కోళ్ల ఆటో బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కేతేపల్లి: మండలంలోని చీకటిగూడెం శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శుక్రవారం కోళ్ల ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం నకిరేకల్ నుంచి సూర్యాపేట వైపునకు బ్రాయిలర్ కోళ్ల లోడుతో వెళ్తున్న ఆటో కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం శివారులో లిటిల్ విలేజ్ హోటల్ సమీపంలోకి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు మధ్యలో డివైడర్‌కు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన పది నిమిషాల వ్యవధిలోనే కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఆటోలోని కోళ్లు లూటీ కాకుండా కాపాడగలిగారు.

### రోడ్డుపైకి వచ్చిన మొసలి


మొసలిని బంధించిన ముదిమాణిక్యం గ్రామస్తులు

అవిదేవులపల్లి: అడవిదేవులపల్లి గ్రామ శివారులో ముదిమాణిక్యం రోడ్డుపై వడ్డెర గుడిసెల వద్ద శుక్రవారం మొసలి కనబడింది. పక్కనే ఉన్న పంట పొలాలకు వెళ్లే కాలువ నుంచి రోడ్డుపైకి మొసలి రావడంతో వడ్డెర గుడిసెల వారు మొసలి పట్టుకొని బంధించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

### బెల్టు షాపులపై పోలీసుల దాడులు

- రూ.70వేల విలువైన మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని ధర్మోజిగూడెం, లక్కారం, లింగోజిగూడెం, చౌటుప్పల్, కొయ్యలగూడెం గ్రామాల్లోని బెల్టుషాపులపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. 8 బెల్టుషాపుల్లో రూ.70వేల మద్యం బాటిళ్లను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు. సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వలిగొండ: కర్రతో కోతులను తరుముతుండగా కరెంట్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం. తుర్కపల్లి గ్రామానికి చెందిన మర్రి రోశయ్య(43) శుక్రవారం ఉదయం ఇంటి వద్ద కర్రతో కోతులను తరుముతుండగా.. ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు కర్రకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

### తప్పుడు ప్రచారం చేయడం తగదు


మాట్లాడుతున్న న్యాయవాది ఎంఏ రహీం

భువనగిరి క్రైం: ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకి హైకోర్టు జరిమానా విధించిందనే విషయం వాస్తవం కాదని ఆమె తరఫు న్యాయవాది ఎంఏ రహీం అన్నారు. విప్ సునీతకు హైకోర్టు రూ.10వేల జరిమానా విధించిందని ప్రసార మాధ్యమాల్లో కథనాలు రావడంతో ఆమె తరఫున వాదిస్తున్న న్యాయవాది ఎంఏ రహీం శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గొంగిడి సునీత తన ఆస్తులు వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుగా చూపెట్టారని సాయిని సతీష్‌కుమార్ 2019లో హైకోర్టులో కేసు వేశాడని అన్నారు. ఆ తర్వాతి కాలంలో సతీష్‌కుమార్ చనిపోగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి అదే కేసులో ఇంప్లిమెంట్ అయ్యి హైకోర్టు రూ.10వేల జరిమానా విధించారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని అన్నారు. తన క్లయింట్ గొంగిడి సునీత తన ఆస్తుల వివరాలను గజంతో సహా ఎన్నికల కమిషన్‌కు సమర్పించారని చెప్పారు. ఆమెపై తప్పుడు ప్రచారం చేస్తున్న బోరెడ్డి అయోధ్యరెడ్డిపై కోర్ట్ ఆఫ్ కంటెమ్ప్ట్‌తో పాటుగా పరువు నష్టం దావా కూడా వేస్తున్నామని తెలిపారు.

### సాగర్‌ను సందర్శించిన పాట్నా హైకోర్టు జడ్జి

నాగార్జునసాగర్: పాట్నా హైకోర్టు న్యాయమూర్తి రాజీవ్ రంజన్ ప్రసాద్ సతీసమేతంగా శుక్రవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. విజయవిహార్ అతిథిగృహంలో వీరికి మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సాగర్‌డ్యాం, బుద్ధవనాలను సందర్శించారు. బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. జాతకకథల పార్కు, తపోవనం, మహాస్థూప పార్కు తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంలోని అష్టబుద్ధుల విగ్రహాల వద్ద ధ్యానం చేశారు. వీరికి గైడ్ సత్యనారాయణ సాగర్‌లోని చారిత్రక ప్రదేశాల గురించి వివరించారు. వీరివెంట పెద్దవూర తహసీల్దార్ సరోజపావని, శరత్‌చంద్ర, ఎస్‌ఐ సంపత్‌గౌడ్ సిబ్బంది కాలిక్ తదితరులు ఉన్నారు.

### 'మిర్యాల'లో రేపు సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని సాగర్ రోడ్డులో నెలకొల్పిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ఆదివారం(అక్టోబరు 1)న ఉదయం 9:58గంటలకు ప్రారంభించనున్నట్లు షాపింగ్ మాల్ నిర్వాహకులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా సినీ నటి రాశి ఖన్నా, స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, స్థానిక కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి హాజరవుతున్నారని తెలిపారు.

### రాహుల్‌ని కలిసిన వీరేశం



నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఢిల్లీలో శుక్రవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం మర్యాద పూర్వకంగా కలిశారు.

### మంత్రుల పర్యటనలో..


తుంగతుర్తిలో సాంస్కృతిక నృత్యాలతో సభకు వస్తున్న కళాకారులు



తుంగతుర్తి సభకు వస్తూ అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు


రామన్నపేట: చెన్నకేశవ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు


తుంగతుర్తిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే కిషోర్


నకిరేకల్‌లో డిగ్రీ కళాశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి


నకిరేకల్: పొదుపు సంఘాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి


నకిరేకల్ సభలో మంత్రి హరీశ్‌రావుతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య